
సాక్షి వికారాబాద్

బుధవారం । 29 । మార్చి । 2023



సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు
సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 8లో▸



కంచెలు ఏర్పాటు చేయండి
గ్రామాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. 8లో▸



అలంకారప్రాయమే..
అన్నదాతలకు సేవలందించడం కోసం నిర్మించిన రైతు వేదికలు చాలా చోట్ల అలంకారప్రాయంగా మారాయి. 9లో▸



న్యూస్‌రీల్

వేగంగా మెడికల్ కాలేజీ పనులు

మంత్రి హరీశ్‌కు వివరించిన కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్‌రావుకు వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు వేగంగా సాగుతున్నాయని కలెక్టర్ నారాయణరెడ్డి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు తెలిపారు. మంగళవారం మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ పనుల పురోగతిని వివరించారు. తరగతి గదుల పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఏప్రిల్ 15 నాటికి పూర్తవుతాయని చెప్పారు. ఆస్పత్రి రెండో అంతస్తులో ప్లాస్టరింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. సకాలంలో వీటిని పూర్తి చేస్తామని మంత్రికి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. అధికారుల సహకారంతో సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని మంత్రికి వివరించారు. వీరితో పాటు అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా వైద్యాధికారి పాల్వన్ కుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి తదితరులు వీసీలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ కుండువా వేసుకుంటున్న నేతలు

పరిగి: మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరిలో ఉప సర్పంచ్ కాకి యాదమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు షకీల్ ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని స్పష్టంచేశారు. ఇతర రాష్ట్రాల్లో కూడా బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవిండ్‌రావు, బీఆర్ఎస్ మండల ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు 34 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొడంగల్ రూరల్: డబుల్ బెడ్ రూం పథకం కింద రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మంగళవారం 34 మంది అప్లికేషన్లు అందజేశారని తహసీల్దార్ బుచ్చయ్య తెలిపారు. పట్టణంలోని హనుమాన్ టెంపుల్ వడ్డెర్‌గల్లీ, బీసీ కమ్యూనిటీ హాల్ బాలాజీనగర్, తహసీల్దార్ కార్యాలయం, వినాయక మండపం లాహోటీకాలనీ, చౌడేశ్వరీ టెంపుల్ వాడలలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ మూడో తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టంచేశారు.

క్రమశిక్షణతో చదవాలి

పూడూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా రాణించాలని డీఈఓ రేణుకాదేవి అన్నారు. మండల పరిధిలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారు చిచ్చు

బీఆర్ఎస్‌లో వర్గ పోరు

- వికారాబాద్‌లో మరోసారి భగ్గుమన్న విభేదాలు
- ఓ ఫాంహౌస్‌లో ఎమ్మెల్యే అసమ్మతి వర్గం సమావేశం
- అక్కడికి చేరుకుని టెంట్లు కూల్చిన ఎమ్మెల్యే వర్గీయులు
- పోలీసుల రంగ ప్రవేశంతో పరిస్థితి అదుపులోకి



కూలిన టెంట్లు, చెల్లాచెదురైన కుర్చీలు

వికారాబాద్: అధికార బీఆర్ఎస్‌లో విభేదాలు భగ్గుమన్నాయి. వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వర్గపోరు కొనసాగుతుండగా మంగళవారం మరోసారి బహిర్గతమయ్యాయి. ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఎమ్మెల్యే అసమ్మతి వర్గం ఓ ఫాంహౌస్‌లో సమావేశమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వర్గీయులు అక్కడికి చేరుకుని వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టెంట్లు కూల్చివేసి, కుర్చీలు చెల్లాచెదురుగా విసిరేశారు. ఎమ్మెల్యే ఆనందన్న.. జిందాబాద్ అంటూ నినాదాలు చేయగా.. ఎమ్మెల్యే అసమ్మతి వర్గం కేసీఆర్, కేటీఆర్, సబితారెడ్డి జిందాబాద్ అని నినదించారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ సత్యనారాయణ సిబ్బందితో వెళ్లి ఇరువర్గాలను సముదాయించారు.

అన్ని చోట్లా గ్రూపులే..

ఇప్పటికే తాండూరులో అధికార పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గీయుల మధ్య నెలకొన్న వైరం రావణ కాష్టంలా కాలుతూనే ఉంది. ఇక వికారాబాద్ నియోజకవర్గంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి వాహనాన్ని ఎమ్మెల్యే వర్గీయులు అడ్డగించటంతో ప్రారంభమైన గ్రూపు తగాదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. ఈ స్థాయిలో కాకపోయినా కొడంగల్, పరిగిలోనూ అసమ్మతి నేతలు నివురు గప్పిన నిప్పులా ఉంటున్నారు. రానున్న రోజుల్లో అక్కడ సైతం ఇలాంటి పరిస్థితులే నెలకొనే అవకాశాలున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఏకపక్షంగా వ్యవహరించారు..

వివాదం విషయంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని అసమ్మతి నేతలు ఆరోపించారు. తాము స్నేహపూర్వకంగా ఏర్పాటు చేసుకున్న సమావేశం వద్దకు రావడమే కాకుండా, గొడవ చేసిన వారిని కాకుండా తమనే అక్కడి నుంచి పంపించేయడం ఏమిటని నిలదీశారు. భోజనాలు చేస్తున్న వారి చేతుల్లోంచి ప్లేట్లు లాగేశారని విద్యా మౌళిక వసరుల కల్పన సంస్థ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, టీఆర్ఎస్ నేతలు చిగుళ్లపల్లి రమేశ్, రాంచంద్రారెడ్డి, వడ్ల నందు, కృష్ణ మండిపడ్డారు.

నాకేమీ తెలియదు



నేను ప్రగతి భవన్‌కు వెళ్లివస్తుండగా విషయం తెలిసింది. గొడవ చేయమని నేనెవరినీ పంపించలేదు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో కుమ్మక్కైన కొంతమంది నాయకులు బీఆర్ఎస్‌లో చీలిక తెచ్చేలా కుట్ర చేస్తున్నారు. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తా. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారి వ్యవహారాన్ని అధిష్టానమే చూసుకుంటుంది.

– ఆనంద్, ఎమ్మెల్యే

అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం

అనంతరం ఎమ్మెల్యే అసమ్మతి వర్గ నేతలు విలేరులతో మాట్లాడుతూ.. ఈసారి ఎమ్మెల్యేకు టికెట్ వచ్చే పరిస్థితి లేదని, ఆయనకు ఓటమి భయం పట్టుకుందని తెలిపారు. అందుకే ఇలాంటి దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే ఆగడాలపై సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. కొంత కాలంగా సొంత పార్టీకి చెందిన తమపైనే అట్రాసిటీ, ఇతర క్రిమినల్ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా ఆత్మీయ సమ్మేళనాలు పెట్టినందుకే తాము కూడా ఇలా సపరేటుగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. 2018 ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం రాత్రింబవళ్లు శ్రమించిన సీనియర్లందరినీ పక్కన పెట్టారని ఆరోపించారు.



వికారాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అసమ్మతి వర్గం నేతలు

కన్నకొడుకే కర్కోటకుడై..

- బీమా డబ్బుల కోసం తండ్రి హత్య
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- పోలీసుల విచారణలో నేరం వెల్లడి



రాథోడ్ ధన్‌సింగ్ మృతదేహం



నిందితుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్

బొంరాస్‌పేట: ప్రజా ప్రతినిధిగా పలువురికి ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తి.. జీవిత బీమా పాలసీ డబ్బుకోసం కన్న తండ్రినే కడతేర్చాడు. దీన్ని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఈ సంఘటన మండల పరిధిలోని బాపన్‌చెర్వుతండా పంచాయతీ బిక్యానాయక్ తండాలో మంగళవారం చోటుచేసుకుంది. కొడంగల్ ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన ప్రకారం.. బిక్యానాయక్ తండాకు చెందిన రాథోడ్ ధన్‌సింగ్ నాయక్(62)కు ముగ్గురు కుమారులు. చిన్నకొడుకు రాథోడ్ శ్రీనివాస్ ఉప సర్పంచ్. రెండో కుమారుడు రాథోడ్ రవినాయక్, పెద్ద కుమారుడు రతన్ నాయక్ తాండూరులో మేస్త్రీ పని చేస్తుంటాడు. తండ్రి ధన్‌సింగ్ పేరిట రూ.50 లక్షల వరకు బీమా పాలసీలు ఉన్నాయి. దీంతో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌నాయక్ తండ్రిని చంపి బీమా డబ్బు కాజేసేందుకు కుట్ర పన్నాడు. మంగళవారం తెల్లవారుజామున రతన్ నాయక్ ఇంటి పని చేసే దగ్గర నీరు పట్టాలని తన ద్విచక్రవాహనంపై తండ్రిని తీసుకుని తాండూరుకు బయల్దేరాడు. బహిర్భూమి కోసం కొడంగల్, ఉడిమేశ్వరం గ్రామాల మధ్య ఆగారు. అక్కడే తండ్రి తలపై రాయితో బలంగా మోదీ హత్య చేశాడు. వెంటనే తన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని చెప్పాడు. శ్రీనివాస్ నాయక్‌పై అనుమానం వచ్చిన సోదరుడు రవినాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అల్లుడు ఉన్నట్లు సమాచారం

కాగా ఈ సంఘటనలో మృతుడి అల్లుడు కూడా ఉన్నట్లు సమాచారం. వృద్ధుడి శవాన్ని రోడ్డుమీదకు లాక్కొని వస్తుండగా ఆర్టీసీ బస్ డ్రైవర్ చూసినట్లు మరో సమాచారం. అడవి పందులు తమ వాహనానికి అడ్డం రావడంతో కిందపడి తండ్రి చనిపోయాడని శ్రీనివాస్ నాయక్ చెప్పినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

సర్పంచ్ భర్త లైంగికంగా వేధిస్తుండు

- అర్ధరాత్రి వచ్చి ఇంటి తలుపులు కొడుతుండు
- మహిళా కమిషన్, ఎస్పీకి ఒంటరి మహిళ ఫిర్యాదు



ధారూరు: తనను సర్పంచ్ భర్త లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని ఓ ఒంటరి మహిళ ఆరోపించింది. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ, మహిళ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. మండల పరిధిలోని అంపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ భర్తను కోల్పోయి ఒంటరిగా జీవిస్తోంది. తాను కొత్త ఇల్లు నిర్మించుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి ద్వారా అనుమతి ఇవ్వకుండా నిలిపివేయించారని, ఇదేమిటని సర్పంచ్ భర్తను ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయింది. ''నేను చెప్పినట్లు వింటేనే నా అండ ఉంటుంది.. లేకుంటే గ్రామంలో ఎలా ఉంటావో చూస్తా'' అని బెదిరిస్తున్నాడని ఆరోపించింది. అర్ధరాత్రి ఇంటి తలుపులు తడుతూ కోరిక తీర్చమని వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఎవరికైనా చెబితే అంతు చూస్తానని హెచ్చరిస్తున్నాడని, ఈ బాధలను భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానని మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది.

కేసు నమోదు చేస్తాం: సీఐ అప్పయ్య

అంపల్లి సర్పంచు భర్త బాబయ్యపై ఒంటరి మహిళ ఫిర్యాదు చేసిందని, విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని సీఐ అప్పయ్య తెలిపారు. ఇంటి స్థలం విషయంలో తగాదాలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు వెల్లడించారు.

కరోనాతో బ్యాంకు బంద్

- కోట్‌పల్లిలో రెండు రోజులుగా నిలిచిన లావాదేవీలు
- ఆందోళనలో స్థానిక ప్రజలు



స్టాఫ్‌కు కోవిడ్ వచ్చిందంటూ బోర్డు

బంట్వారం: కరోనా కలకలంతో కోట్‌పల్లి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌ను రెండు రోజులుగా మూసేశారు. షటర్ మూసి ఉంచడంతో పాటు స్టాఫ్‌కు కోవిడ్ వచ్చిందంటూ బోర్డు తగిలించారు. ఈ క్రమంలో సేవలు నిలిచిపోయాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం బ్యాంకుకు వెళ్లిన కస్టమర్లు వెనక్కి వచ్చేశారు. బ్యాంకులో కరోనా వ్యాపించిందనే వార్తల నేపథ్యంలో స్థానికులు ఉలిక్కి పడ్డారు. గడిచిన వారం రోజుల్లో బ్యాంకుకు వెళ్లిన వారు టెస్టులు చేయించుకునేందుకు వెళ్లారు. హోం ఐసోలేషన్‌లో ఉండలా..? వద్దా..? అని ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సంబంధిత బ్యాంక్ మేనేజర్ రఘునందన్‌రావును అడిగేందుకు 'సాక్షి' ఫోన్‌ద్వారా ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గీతికను అడగగా ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు. తాము కూడా వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఇక నుంచి ప్రతి రోజు కోట్‌పల్లి పీహెచ్‌సీలో కోవిడ్ టెస్టులు చేస్తామన్నారు. అదేవిధంగా ఇంటింటి ఫీవర్ సర్వే చేస్తామని తెలిపారు.

ఆదర్శంగా గురుకులాలు

- విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి
- బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్



పెద్దేముల్ మండల మంబాపూర్‌లోని మహత్మా జ్యోతి బాపూలె పాఠశాలను సందర్శించిన బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్

పెద్దేముల్: తెలంగాణ గురుకులాలు దేశానికే ఆదర్శమని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. మంబాపూర్ గ్రామ సమీపంలోని మహాత్మాజ్యోతిరావు బాపూలె గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. స్కూల్ ప్రాంగణంలోని తరగతి గదులు, హాస్టల్ భవనం, మెస్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు సలహాలు, సూచనలు అందజేశారు. బాగా చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని, ఉపాధ్యాయులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. విద్యార్థి దశలో కష్టపడి చదువుకున్న వారే జీవితంలో అత్యున్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఎంతగానో కృషిచేస్తున్నారన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిచడంతో పాటు గురుకులాల ఏర్పాటుతో నాణ్యమైన బోధన అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టడంతో అడ్మిషన్లు పెరిగాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా రాణిస్తున్నాయని సంతోషం వ్యక్తంచేశారు. గతంలో కేవలం కార్పొరేట్ విద్యా సంస్థలో చదివే వారికి మాత్రమే మెడికల్, ఇంజనీరింగ్ సీట్లు వచ్చేవని, తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వ కాలేజీలు, వసతి గృహాల్లో చదవుతున్న ఎంతో మంది కాంపిటేటివ్ పరీక్షల్లో సత్తా చాటుతున్నారని తెలిపారు. గురుకుల విద్యార్థులు ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, ఐఐటీ, ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధిస్తున్నారన్నారు.

ఐక్యతతోనే అవార్డుల పంట

- మంత్రి సబితారెడ్డి
- అట్టహాసంగా జిల్లాస్థాయి జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలోఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, యాదయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణకు జాతీయ స్థాయిలో అవార్డుల పంట పండిందని, కలిసికట్టుగా పని చేయడంతోనే ఇది సాధ్యమైందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాస్థాయి జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఎంపిక చేసిన తొమ్మిది అంశాల్లో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన పాలక వర్గాలకు మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీ అభివృద్ధి చెందడంతో పాటు, దాని పరిధిలోని ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రానికి జాతీయ అవార్డులు వచ్చాయన్నారు. ప్రభుత్వ సుపరిపాలనతో జాతీయ స్థాయిలో వరుస అవార్డులు వరిస్తున్నాయన్నారు. 2021–22 సంసద్ ఆదర్శ గ్రామ యోజన కింద కేంద్రం దేశ వ్యాప్తంగా 20 ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేయగా, అందులో తెలంగాణలోని 19 గ్రామాలు ఉత్తమ జీపీలుగా ఎంపికయ్యాయని వివరించారు. గతంలో కేంద్రం పంచాయతీలకు అందించే అత్తెసరు నిధులు నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలకే సరిపోయేవని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి తెలంగాణలో పల్లె ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, కేంద్రం అందిస్తున్న నిధులకు సరిసమానంగా స్టేట్ ఫైనాన్స్ ద్వారా నిధులు సమకూరుస్తోందని తెలిపారు. దీంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు వృద్ధి చెందాయని, ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగయ్యాయన్నారు. ఇకముందు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ అనితా హరినాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కాలె యాదయ్య, కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్, జెడ్పీ సీఈవో దిలీప్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ప్రభాకర్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్న ప్రజలు
- స్వామివారి పాదాల చెంతకు చేరిన గరుడ ధ్వజం

పదకొండు రోజుల పాటు కొడంగల్‌లో అంగరంగ వైభవంగా కొనసాగిన శ్రీమహాలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి ధ్వజారోహణం నిర్వహించారు. మాఢ వీధుల్లో స్వామివారి ఊరేగింపు కొనసాగుతుండగా.. భక్తులు మంగళహారతులు అందించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాల ఆరంభ సూచకంగా, సకల దేవతలను ఆహ్వానిస్తూ ఆలయ ఆవరణలో ఎగురవేసిన గరుడ పటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజాన్ని తీసి స్వామివారి పాదాల చెంతకు చేర్చారు. వేడుకలకు సహకరించిన వారితో పాటు ఆచార్య స్వాములు, పండితులు, తిరుమల నుంచి వచ్చిన అర్చకులకు మంగళవారం ఆలయ ధర్మకర్తలు ఘనంగా సన్మానించారు.

– కొడంగల్ రూరల్



మాఢ వీధుల్లో స్వామివారి ఊరేగింపు



హారతిని మొక్కుతున్న భక్తులు

క్లుప్తంగా

రేపు అనంతగిరిలో సీతారాముల కల్యాణం

అనంతగిరి: అనంతగిరిగుట్ట అనంతపద్మనాభ స్వామి ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నరేందర్‌, ట్రస్టీ పద్మనాభం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.15గంటలకు నిర్వహించే ఈ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని ఈఓ, ట్రస్టీలు కోరారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్‌

యాలాల: బీజేపీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మరళీకృష్ణగౌడ్‌ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అగ్గనూర్‌ గ్రామానికి చెందిన కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మరళీకృష్ణగౌడ్‌ మాట్లాడుతూ.. తాండూరు ప్రజలు బీజేపీవైపు ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం బీజేపీ యువ నాయకుడు వీరు ముదిరాజ్‌ ఇంట్లో శుభకర్యానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంగెం హన్మంత్‌ పాల్గొన్నారు.

సెర్ప్‌ ఉద్యోగుల హర్షం

అనంతగిరి: ఏప్రిల్‌ 1 నుంచి జీఓ 11 ప్రకారం కొత్త వేతనాలు చెల్లించనున్న నేపథ్యంలో సెర్ప్‌ ఉద్యోగులు మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డికి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను రెగ్యులరైజ్‌ చేయడంతో పాటుగా జీఓ 11 పేస్కేలు అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించడం సంతోషంతో పాటు ఉద్యోగంపై భరోసా కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కన్వీనర్‌ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి ఆనంద్‌, ప్రభు, రాంచందర్‌, బందయ్య, నర్సింలు, బాలరాజు, అశోక్‌ తదితరులు ఉన్నారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోండి

- జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌
- మొగుల్లపల్లిలో పంటల పరిశీలన

కుల్కచర్ల: రైతులు తమ పంట పొలాలకు సోకుతున్న తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌ అన్నారు. చౌడాపూర్‌ మండలం మొగుల్లపల్లిలో మంగళవారం రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం జింక్‌ లోపం నివారణకు చిలాటెడ్‌ జింక్‌ 1కేజీ ఒక ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్‌ 120 గ్రాములు ఎకరానికి స్ప్రే చేయాలన్నారు. రైతులు తాము వేసిన పంటల వివరాలను స్థానిక వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భావన, గ్రామ రైతుబంధు కోఆర్డినేటర్‌ మొగులయ్య, రైతులు రాజు నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల రిమాండ్‌

యాచారం: కందుకూరు మండలం మీరాఖాన్‌పేట, యాచారం మండలం కుర్మిద్ద గ్రామాల్లో బైక్‌, ఆటోల దొంగతనాలను పాల్పడిన ముగ్గురిని యాచారం పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్‌ మండలం మదనాపల్లికి చెందిన శ్యామ్‌, శివకుమార్‌, శ్రీ చరణ్‌ ఆదివారం రాత్రి మీరాఖాన్‌పేటలో ఒక బైక్‌ను, కుర్మిద్ద గ్రామంలో ఆటోను తరలిస్తుండగా ఆయా గ్రామాల ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. నిందితులపై గతంలో పలు కేసులు ఉన్నట్లు ఎస్‌ఐ ప్రసాద్‌ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాల వారికి సీఎంఆర్‌ఎఫ్‌ నుంచి రూ.68లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే బాధితులకు పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం కేసీఆర్‌ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ ముకుందఅశోక్‌ కుమార్‌, ఎంపీపీ అరవింద్‌రావు, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేందర్‌, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణ కేంద్రంలోని మార్కెట్‌ యార్డులో దుర్గా భవాని ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఎంపీపీ అరవింద్‌రావు, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేందర్‌, ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బేస్‌ ప్రధానం..

విద్యార్థి ఉన్నత స్థాయిలో రాణించాలంటే విద్యార్థులకు పదోతరగతి బేస్‌ అని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి లక్షాన్ని నిర్దేశించుకుని శ్రమించాలని సూచించారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ పుస్తకాలు దగ్గరవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ ముకుందఅశోక్‌ కుమార్‌, ఎంపీపీ అరవింద్‌రావు, మండల విద్యాధికారి హరిశ్చందర్‌, ఎస్సై విఠల్‌ రెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేందర్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్‌ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌ నిర్వహిస్తున్న కలెక్టర్‌

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయండి

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌ నారాయణరెడ్డి

వికారాబాద్‌ అర్బన్‌: గ్రామాల్లో కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్స్‌ను గుర్తించి కంచెలతో పాటు ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని కలెక్టర్‌ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పల్లె ప్రగతి, విద్యుత్‌, మిషన్‌ భగీరథ, మన ఊరు–మన బడి, సీసీ రోడ్ల నిర్మాణం, జాతీయ ఉపాధి హామీ పథకం అమలు తీరుపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో విద్యుత్‌ ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్‌ ప్రమాదాలు జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ గ్రామానికి జనాభా ప్రాతిపదికన మిషన్‌ భగీరథ నీటి సరఫరా చేయాలని సూచించారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులన్నింటినీ ఎంపీడీఓలు బాధ్యత తీసుకొని ఏప్రిల్‌ చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌ రాహుల్‌ శర్మ, డీపీఓ తరుణ్‌ కుమార్‌, జెడ్పీ సీఈఓ జానకి రెడ్డి, డీఈఓ రేణుకాదేవి, మిషన్‌ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పంచాయతీకి రూ.50 లక్షలు



లక్ష్మీనారాయణపూర్‌లో పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పల్లెపల్లెకూ పైలెట్‌ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.50లక్షలు కేటాయిస్తున్నామని తాండూరు ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌ రెడ్డి అన్నారు. పల్లెపల్లెకు పైలెట్‌ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన లక్ష్మీనారాయణపూర్‌, మల్‌రెడ్డిపల్లి, అగ్గనూరు, ఎన్కెపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదం తనపైనే ఉందని, వారి అంచనాలకు తగినట్లుగా గ్రామాల రూపురేఖలు మారుస్తానన్నారు. సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే తన ముందున్న కర్తవ్యమని చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామంలో పర్యటించి, సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు పల్లె పల్లెకు పైలెట్‌ కార్యక్రమం చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, వైస్‌ ఎంపీపీ రమేశ్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజుగౌడ్‌, ఏఎంసీ చైర్మన్‌ విఠల్‌ నాయక్‌, కోఆప్షన్‌ సభ్యుడు అక్బర్‌బాబా, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నర్సింహ, భీమప్ప, జయమ్మ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, దత్తురెడ్డి, వడ్డే రాములు, పేర్కంపల్లి వెంకట్‌ తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలను అందిస్తున్న అంగన్వాడీ సూపర్‌వైజర్లు

దోమ: సమతుల్యమైన ఆహారాన్ని తీసుకున్నపుడే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని అంగన్వాడీ సూపర్‌వైజర్లు పద్మ, ఇందిర, నిర్మల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దిర్సంపల్లిలో సర్పంచ్‌ శాంతారెడ్డితో కలసి పోషణ మాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు పోషకాహారం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారుల్లో ఎదుగుదల లేకపోవడం, పోషకాహారలేమితో తక్కువ బరువు ఉన్న శిశువు జన్మిస్తారన్నారు. గర్భిణులు, బాలింతలు, విద్యార్థుల్లో రక్తహీనత లోపం తగ్గించడమే లక్ష్యంగా జాతీయ పోషకాహార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు గుడ్లు, పాలు, బాలామృతం, చిరుతిళ్లు అందిస్తూ నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు చిరుతిళ్లు, చిరుధాన్యాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ శిరీష, దాదాపూర్‌ సెక్టార్‌ అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, సుమిత్ర, అఫ్సానా బేగం, ఆశ వర్కర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్ష సాగును ప్రోత్సహిస్తాం

- మంత్రి సబితారెడ్డి
- తుక్కుగూడలో ద్రాక్ష తోట సందర్శన

తుక్కుగూడ: జిల్లాలో ద్రాక్ష సాగును ప్రోత్సహిస్తామని మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. తుక్కుగూడ పరిధిలో రైతు కె.అంజిరెడ్డి సాగు చేసిన ద్రాక్ష తోటను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రైతులు అనేక రకాల పండ్ల తోటలను సాగు చేసేవారన్నారు. క్రమంగా రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం పెరగడం వల్ల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందన్నారు. ఇతర పంటలు సాగు చేసిన రైతులు అనేక కష్టాల నష్టాలు భరించారని, ప్రస్తుతం పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించారని తెలిపారు. అంజిరెడ్డి తన 20 ఎకరాల్లో ద్రాక్ష పంటను సాగు చేశాడని, ఈ ఏడాది దిగుబడి బాగా వచ్చిందని తెలిపారు. కోహెడ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసే పండ్ల మార్కెట్లో ద్రాక్ష విక్రయాల కోసం ప్రత్యేక కౌంటర్‌ ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్‌ ఆదేశాల మేరకు తాము రైతులను కలిసి వారి కష్టాలను తెలుసుకోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన వన శాఖ అధికారులు, బీఆర్‌ఎస్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆన్‌లైన్‌ జాబ్‌మేళా

ఇబ్రహీంపట్నం రూరల్‌: నిరుద్యోగులకు ఈ నెల 30న ఆన్‌లైన్‌ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారి జి.జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఫార్మసీ, బీఫార్మసీ చదివిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. పదోతరగతి, ఇంటర్‌, డిగ్రీ చదివిన మెడికల్‌ స్టోర్‌లో అనుభవం ఉన్న అభ్యర్థులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేతనం నెలకు రూ.15 వేల నుంచి రూ.18వేల వరకు ఉంటుందన్నారు. అపోలో ఫార్మసీలో 100 ఖాళీలు ఉన్నాయని, జిల్లాలో పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 82476 56356, 90630 99306 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రంగంలోకి ఎస్‌బీ.. ఇంటెలిజెన్స్‌ అధికారులు!

- సాక్షి కథనంతో కదలిక
- పోలీసు అధికారి తీరుపై అంతర్గత విచారణ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'ఆ సారు.. రూటే వేరు' శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనం చర్చనీయాంశమైంది. సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో తీవ్ర దుమారాన్ని రేపింది. ఏ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఈ తతంగం నడిచిందనే విషయం గురించి జనం ఆరా తీశారు. పోలీసులే ఈ విధంగా ప్రవర్తిస్తే.. ఇక ఎవరితో చెప్పుకొంటామని మాట్లాడుకున్నారు. సదరు పోలీసు అధికారి తీరును తప్పుబట్టారు. మరోవైపు ఈ కథనంపై పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తు వేగవంతం చేసినట్లు తెలిసింది. ప్రతి అంశంపై ఆరా తీశారని, ఆరోపణలపై అంతర్గతంగా విచారణ జరపాలని ఎస్‌బీ, ఇంటెలిజెన్స్‌ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. విచారణ అనంతరం సదరు అధికారిపై వేటు పడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే సైబరాబాద్‌ సీపీ కార్యాలయంలో ఆ అధికారిపై పలు ఫిర్యాదులు ఉన్నట్లు సమాచారం.

నాబార్డు నిధులతో గోదాం నిర్మాణం

ధారూరు పీఏసీఎస్‌ చైర్మన్‌ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్‌ సత్యనారాయణరెడ్డి

ధారూరు: ప్రభుత్వ భూమిలో రూ.2.30కోట్ల నాబార్డు నిధులతో రైస్‌మిల్‌, గోదాం నిర్మించనున్నట్లు ధారూరు పీఏసీఎస్‌ చైర్మన్‌ సత్యానారాయణరెడ్డి వెల్లడించారు. మంగళవారం పీఏసీఎస్‌ కార్యాలయంలో మంగళవారం రైతులతో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే వేసవి కాలం పంటలు చేతికొచ్చే సమయానికి రైస్‌మిల్‌, గోదాం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. షాపింగ్‌ కాంప్లెక్స్‌, ధర్మకాంట ఏర్పాటుకు తీర్మానించామన్నారు. తరిగోపుల గ్రామంలో ఉన్న పాత భవనానికి రంగులు వేయించి ప్రహరీ నిర్మాణం, నాగారంలో సొసైటీకి ప్రభుత్వం ఇచ్చిన అర ఎకరా భూమి చుట్టూ ఫెన్సింగ్‌, గోదాం నుంచి రైతు వేదిక వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఈ మహాసభలో తీర్మానించామని ఆయన వివరించారు. వాయిదా మీరిన దీర్ఘకాలపు రుణాలను, స్వల్పకాలిక రుణాలను తీసుకున్న రైతులంతా మార్చి 31వరకు చెల్లించి సంఘం అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. 2023–24 సంవత్సరానికి కొత్త రైతులకు స్వల్పకాలిక రుణాలను ఇవ్వాలని హైదరాబాద్‌ జిల్లా కేంద్ర సహకార బ్యాంకును కోరుతూ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సభలో సీఈఓ కె.నర్సింహులు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మండల సాధనకు రాజీనామాకు సిద్ధం

తట్టెపల్లి పీఏసీఎస్‌ చైర్మన్‌ లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న పీఏసీఎస్‌ చైర్మన్‌ లక్ష్మారెడ్డి

పెద్దేముల్‌: తట్టెపల్లి మండల సాధనకు సర్పంచ్‌, ఎంపీటీసీ సభ్యులతో పాటు తానూ పీఏసీఎస్‌ చైర్మన్‌ పదవికి రాజీనామాకు సిద్ధమని లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తట్టెపల్లిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం జిల్లాలో వెనుకబడి ఉన్న తట్టెపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. ఇందుకు మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి సహకరించాలని కోరారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దుకు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న తట్టెపల్లి, అడ్కిచెర్ల, పాషాపూర్‌, జైరాతండా, రచ్చకట్టతండాతో పాటు పలు గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని, కనీస వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తట్టెపల్లి ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ అంజప్ప మాట్లాడుతూ.. తట్టెపల్లి మండల సాధనకు తాము దేనికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం కొత్త మండలాలు ప్రకటించి తట్టెపల్లిని ప్రకటించకపోవడం సరికాదన్నారు. మండల కేంద్రం ఏర్పాటు చేసేవరకు దరిగడ్డ ప్రాంతం నాయకులమంతా ఏకమై పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తట్టెపల్లి మాజీ సర్పంచ్‌ వీరేశం, పీఏసీఎస్‌ మాజీ డైరెక్టర్‌ ప్రభుకుమార్‌, డీసీసీబీ మాజీ డైరెక్టర్‌ నారాయణగౌడ్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు గోపాల్‌, జగన్‌, బస్వరాజ్‌, చంద్రశేఖర్‌, మాణిక్‌పటేల్‌, అబ్రహం, మైబుసాబ్‌, రహీం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి యూనిట్లు పెంచాలి

దరఖాస్తుదారుల ఆందోళన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన దరఖాస్తుదారులు

బొంరాస్‌పేట: మైనార్టీ కార్పొరేషన్‌ అందిస్తున్న స్వయం ఉపాధి రుణాల సంఖ్యను పెంచాలని దరఖాస్తుదారులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మంగళవారం ఉదయం 11గంటలకు ఎంపీడీఓ పాండునాయక్‌ సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారు. మండలానికి కేటాయించిన ఆరు యూనిట్లకుగాను 186 దరఖాస్తులు వచ్చాయి. దీంతో మిగిలిన వారంతా కార్యాలయం ఎందుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ప్రజాసంఘాలు, ప్రతి పక్ష నాయకులు వారి ఆందోళనకు మద్దతిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, సీఐటీయూ బుస్స చంద్రయ్య, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, కాంగ్రెస్‌ నాయకులు నర్సింలుగౌడ్‌ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. మైనార్టీ కార్పొరేషన్‌ కింద తక్కువగా యూనిట్లు మంజూరవుతున్నాయని ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మొల్ల కరీం, బుక్క అయూబ్‌ తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్య జయంతి అధికారికంగా జరపాలి

మంత్రి కేటీఆర్‌ను కోరిన కుర్మ సంఘం నాయకులు



మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుర్మ సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్‌: తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని కుర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఏ మల్లేశం, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు కే మల్లేష్‌ కోరారు. మంగళవారం నగరంలో మంత్రి కేటీఆర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అలాగే కుర్మ సంఘం భవన నిర్మాణం పూర్తయ్యిందని సీఎం కేసీఆర్‌ చేతుల మీదుగా ప్రారంభానికి సమయం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పుష్ప నాగేష్‌, అరుణ్‌, మాజీ కార్పొరేటర్‌ ఏ మధు పాల్గొన్నారు.

శిశుగృహకు అనాథ చిన్నారులు



చిన్నారులను శిశుగృహ అధికారులకు అప్పగిస్తున్న ఆంజనేయులు తదితరులు

కుల్కచర్ల: తల్లి ఆకస్మిక మరణం.. తండ్రి జైలుకు వెళ్లడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. ఈ చిన్నారునుల అధికారులు శిశుగృహకు తరలించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మండల కోఆర్డినేటర్‌ ఆంజనేయులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చుక్కమ్మ మూడురోజుల క్రితం మృతి చెందింది. తండ్రి రాములు భార్యమృతికి కారణమైయ్యాడనే కారణంగా జైలుకు వెళ్లాడు. దీంతో ఇద్దరు చిన్నారులు గౌతమ్‌(2), కార్తీక్‌ (3నెలలు) అనాథలుగా మారారు. దీర్ఘకాలిక సంరక్షణకు ఎవరూ ముందుకు రాకపోవడంతో స్థానిక అధికారుల సూచనల మేరకు ఏఎస్‌ఐ సత్యశీలారెడ్డి ఆధ్వర్యంలో శిశుగృహ చిన్నారులను అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పద్మ, అలివేలు, చైల్డ్‌ లైన్‌ మండల కోఆర్డినేటర్‌ రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమ నిర్మాణం



జల్‌పల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌లో కొనసాగుతున్న షట్టర్‌ నిర్మాణం

పహాడీషరీఫ్‌: జల్‌పల్లి పెద్ద చెరువు ఆక్రమణకు గురవుతోంది. ఇటీవల చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఓ వ్యక్తి ఏకంగా షెట్టర్‌ నిర్మాణ పనులు ప్రారంభించాడు. ప్రస్తుతం ఈ పనులు పూర్తి కావచ్చాయి. రోడ్డుకు సమీపంలో చెరువు ఉండడంతో అక్రమ నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది. చెరువు పరిధిలో వ్యవసాయ భూములు ఉంటే వాటిని కేవలం సాగు మాత్రమే వినియోగించాలి. కానీ ఓ వ్యక్తి ఏకంగా కమర్షియల్‌ నిర్మాణాలు మొదలు పెట్టాడు. చెరువు కబ్జాకు గురికావడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> మండలంలో ప్రభుత్వ భూములు కబ్జా బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. జల్‌పల్లి చెరువు పరిసరాల్లో కబ్జా విషయమై ఫిర్యాదు వచ్చింది. చెరువును పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే తమకు సమాచారం ఇవ్వాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.
>
> – జనార్దన్‌రావు, తహసీల్దార్‌, బాలాపూర్‌

కుట్ర పూరితంగానే రాహుల్‌పై వేటు

రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్‌: కుట్ర పూరితంగా రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. బడంగ్‌పేట చౌరస్తాలో మంగళవారం సత్యాగ్రహదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని దేశ ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. భారత్‌ జోడో పేరుతో కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌ వరకు పాదయాత్ర చేసి ప్రజలను ఏకతాటిపైకి తెస్తుంటే ఓర్వలేక కాంగ్రెస్‌ను దెబ్బ తీసేందుకు ఇలాంటి నీచమైన కుట్రలకు తెగించారని ధ్వజమెత్తారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత, పార్టీ సీనియర్‌ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ సంపదనంతా అదానీకి దోచి పెడుతూ.. దేశాన్ని ఆర్థికమాంద్యం వైపు నడిపిస్తున్న సత్యాన్ని దేశ ప్రజలకు ఎక్కడ రాహుల్‌ చెబుతాడోనని భయం వేసి ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు.